# గణపతి బాబాయి

కథ

## కల్లూరి భాస్కరం



**విశాలాక్షి ఫోన్ చేసిన తర్వాతగానీ, బాబాయి జ్ఞాపకాలు మనోఫలకం మీద ఎంతగా మసకబారి పోయాయో నాకు తెలిసిరాలేదు. ఆశ్చర్యమూ, బాధా కూడా కలిగాయి.**

**ఫోన్ మోగేసరికి తీశాను. అవతల విశాలాక్షి. మా పెద్ద బాబాయి కూతురు. మారేడ్‌పల్లిలో ఉంటుంది. కుశలప్రశ్నలు అయ్యాక అంది.**

**'ఒరేయ్ అన్నయ్యా! ఎల్లుండి మా నాన్న ఆబ్దికంరా!'**

'అలాగా' అన్నాను. అది ఆ మాట అంటున్నప్పుడు ఖచ్చితంగా దాని కళ్ళు వర్షిస్తూ ఉంటాయని నాకు తెలుసు. దానినెత్తిమీద నీళ్ళ కడవ ఉంటుంది. బంధువులు కనబడ్డా, బంధుత్వాలు గుర్తొచ్చినా, చిన్నపాటి సంతోషం కలిగినా, దుఃఖం కలిగినా అది ఏడుస్తుంది. ఇలా కంటతడి పెట్టుకొనే అలవాటు వాళ్ళన్నయ్యకీ ఉండేది. ఆయన నలభై అయిదేళ్ళకే హైబ్లడ్ ప్రెషర్‌వల్ల బ్రెయిన్ హెమరేజ్ వచ్చి చనిపోయాడు.ఆ రోజు సాయంత్రమే కొత్తగూడెం నుంచి హైదరాబాద్ ఇంటికొచ్చి స్నానంచేసి పడక్కుర్చీలో కూర్చొని తనకిష్టమైన శాస్త్రీయసంగీతం క్యాసెట్ వింటూ కెవ్వున కేకవేసి కుర్చీలోనే కుప్పకూలిపోయాడు. అప్పటికి మా బాబాయి పక్షవాతంతో మంచంపట్టి చిన్నకొడుకు దగ్గర కొత్తగూడెంలో ఉన్నాడు. పెద్దకొడుకు నాన్నను హైదరాబాద్ తీసుకువెడతానంటే, చిన్న కొడుకు ఒప్పు కోలేదు. నాన్నను తనే చూసుకుంటానన్నాడు. ఇద్దరికీ ఘర్షణ జరిగింది. ఆ రోజే పెద్దాయన బయలుదేరి సాయంత్రానికి హైదరాబాద్ వచ్చాడు. అప్పటికే బ్లడ్‌ప్రెషర్ ఉండడంతో మనస్సు మీద ఆలోచనలు, సమస్యల ఒత్తిడి బాగా పెరిగిపోయి కాబోలు మెదడులో రక్తనాళాలు చిట్లి కన్నుమూశాడు. తీవ్ర అస్వస్థతతో మంచంపట్టి ఉన్న మా బాబాయికి పెద్దకొడుకు మరణవార్త చెప్పలేదు. కొడుకు మరణించిన సంగతి తెలియకుండానే రెండు మాసాలకే ఆయన గతించాడు.

చిన్నపాటి భావోద్వేగానికే చలించిపోయి కళ్ళు చెమ్మగిల్లే అలవాటు మా పెద్ద బాబాయికీ ఉంది. ఆయనకేనేమిటి మానాన్నకీ, మా చిన్నబాబాయికీ కూడా ఉంది. ఇంకా చెప్పాలంటే మా నాన్న, ఆయన తమ్ముళ్ళ సంతానంలో అందరికీ ఉంది. ఆనందమొచ్చినా, దుఃఖం వచ్చినా, ఒక మంచి పాట విన్నా, ఒక మంచి పుస్తకం చదివినా, ఒక కరుణరస భరిత సన్నివేశం చూసినా మేమందరం ఏడుస్తాం. అంతరంగ మాలిన్యాలనన్నిటినీ కడుక్కోడానికి స్వచ్ఛమైన కన్నీటి సంపదను భగవంతుడు మా కుటుంబానికి ఎక్కువిచ్చాడేమో ననిపిస్తుంది. చీటికీమాటికీ కళ్ళు చెమ్మగిల్లడం మా వంశ పారంపర్య లక్షణం. మా తాతగారి గురించి మాకు అట్టే తెలియదు. ఆయన స్ఫురద్రూపి అనీ, మంచి రసికుడనీ, హాస్యచతురుడనీ, ఊళ్ళో కరణీకం చేస్తూ ఒకరి జుట్టు ఒకరికి ముడిపెట్టి వినోదించేవాడనీ చెప్పుకునేవారు. మా నాయనమ్మ ఆయనకు రెండో భార్య. కృష్ణభక్తిసంప్రదాయాన్ని ప్రచారం చేసిన వల్లభాచార్యుల వారి ఇంటిపేరు, మా నాయనమ్మ పుట్టింటివారి ఇంటి పేరూ ఒకటే. ఆమె కూడా కృష్ణభక్తురాలు. మధురభక్తి సంవేదనలూ, అవి మనసుకూ మాటకీ కలిగించే మార్దవం ఆమె తమ్ముళ్ళలోనూ, వాళ్ళ సంతానంలోనూ కూడా కనిపిస్తాయి. వాళ్ళ కళ్ళ వెనకకూడా జలపాతాలు దాగి ఉంటాయి.

'ఏంలేదురా, మీకు దగ్గర్లో బర్కత్పురలో రాఘవేంద్రమఠంలో డబ్బిస్తే తద్దినాలు పెడతారట కదా. నువ్వెళ్ళి డబ్బు కట్టి వివరాలు చెప్పి నాన్న తద్దినానికి ఏర్పాటు చేస్తావేమోనని అడగడానికి ఫోన్ చేస్తున్నానురా. నేను అటొచ్చినప్పుడు ఆ డబ్బు ఇచ్చేస్తాను' అంది విశాలాక్షి.

'నువ్వు నాకు తిరిగి డబ్బు ఇవ్వనక్కర్లేదుకానీ, తప్పకుండా ఆ ఏర్పాటు చేస్తాను, సరేనా' అన్నాను.

ఫోన్ సంభాషణ ముగిసిన తర్వాత చాలాసేపు పెద్దబాబాయి గురించిన జ్ఞాపకాలను కలబోసుకుంటూ కూర్చుండిపోయాను. ఆయన చనిపోయి పదిహేనేళ్ళు అవుతోంది. ఆయన పోయిన రెండేళ్ళకే పిన్ని కూడా పోయింది. ఆయన ముగ్గురు సంతానంలో చిన్నకొడుకు కూడా ఈ మధ్యనే చనిపోయాడు. ఒక్కతే ఆడపిల్ల, విశాలాక్షి. మా బాబాయి పేరు గణపతిశాస్త్రి. విశాలాక్షి ఫోన్ చేసిన తర్వాతగానీ, ఈ పదిహేనేళ్ళల్లో మా బాబాయి జ్ఞాపకాలు మనోఫలకం మీద ఎంతగా మసకబారి పోయాయో నాకు తెలిసిరాలేదు. ఆశ్చర్యమూ, బాధా కూడా కలిగాయి. మాకు ఊహ తెలిసినప్పటినుంచి, మా అమ్మానాన్నల అస్తిత్వం మా కుటుంబంలో ప్రగాఢంగా పరచుకొన్నంత కాలమూ మా గణపతిబాబాయి, సూరిబాబాయి, వాళ్ళ కుటుంబసభ్యులు, వాళ్ళ రాకపోకలు, పిల్లల పెళ్ళిళ్ళు, మాటపట్టింపులు, వాళ్లగురించిన ముచ్చట్లు మా కుటుంబంలో విడదీయలేని భాగాలు. వాళ్ళ గురించిన ఆలోచనలు వెలిసిపోయే రోజు వస్తుందని కానీ, వాళ్ళకు దూరంగా మాకు ప్రత్యేకమైన అస్తిత్వం ఉంటుందని కానీ ఊహించడానికి కూడా సాధ్యం కానంతగా మా ఊహలతో స్వాభావికంగా అల్లుకుపోయిన పాత్రలు వాళ్ళు. బాల్యంనుంచి పరిచయమైన జీవనరంగస్థలం మీద నిత్యమూ దర్శిస్తూ వచ్చిన ఆ పాత్రలన్నింటినీ ఒక్కొక్కరి మరణమే ఎలా అదృశ్యం చేసి చివరకు ఆ రంగస్థలాన్నే మాయం చేసిందో తలచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

మా గణపతిబాబాయి స్థూలకాయుడు. అయినా, పసిమిరంగులో, లేతతమలపాకులా ముట్టుకుంటే కందిపోయేటంత సున్నితంగా ఉండేవాడు.

అందగాడని చెప్పలేం కానీ నిండైన మనిషి. చూడగానే ఎవరినైనా ఆకట్టుకునే విగ్రహం ఆయనది. గోష్పాదమంత పిలక ఉండేది. ఆయన మాటలో, నడకలో ఒకవిధమైన వయ్యారం, మార్దవం, లావణ్యం ఉట్టిపడేవి. అదే సమయంలో, అప్పుడప్పుడు ఎదుటివారిని న్యూనపరిచే పెడసరపు ధోరణి, వెక్కిరింపు, అహం, అతిశయం, హాస్యధోరణి తొంగిచూసేవి. ఆయనలో అదొక విచిత్ర వైరుధ్యం. ఆయన మాట గొంతు నాళాలను చీల్చుకొని వస్తున్నట్లు కీచుగా, బొంగురుగా ధ్వనిస్తూ విలక్షణంగా ఉండేది. ఆయన కోప్పడిన సందర్భాలు నేను చూసినవి చాలా తక్కువ. కోపం వచ్చినప్పుడు అందరిలా ఆయన గొంతు పెంచి మాట్లాడేవాడు కాదు. గొంతునొక్కి మాట్లాడేవాడు.

పౌరాణికుడిగా, ఆయనది తిరుగులేని స్థానం. అటు చెన్నపట్నం (ఆయన మద్రాసును ఎప్పుడూ చెన్నపట్నం అనే పిలిచేవారు) నుంచి ఇటు ఖరగ్‌పూర్ వరకు ఆయన పురాణప్రవచనం చేయని నగరమూ, పట్టణమూ లేదు. ఆయనకు ప్రతిచోటా అభిమానులుండేవారు. పౌరాణికుడిగా ఎంతపేరు ఉందో, డబ్బు మనిషిగా ఆయనకు అంతపేరూ ఉంది.


ఆయన ఎక్కడా ఉద్యోగం చేయలేదు. స్థిరంగా ఏ ఊళ్ళోనూ ఉండలేదు. దేశదిమ్మరి జీవితం ఆయనది. జీవితాంతం ఆయన పౌరాణిక వృత్తిలోనే గడిపాడు. ఊరూరా తిరిగి పురాణం చెప్పుకుంటూ జీవనం గడుపుకోవడానికి అవసరమైన లౌక్యపు దినుసులన్నీ ఆయన నడకలో, హావభావాలలో, మాట చమత్కారంలో చక్కగా అమరి ఉండేవి. పౌరాణికుడిగా శ్రోతలను రంజింపచేయగలిగిన పట్లన్నీ ఆయనకు కరతలామలకం. వేషం దగ్గర కూడా ఆయనచాలా శ్రద్ధ తీసుకొనేవాడు. మల్లెపువ్వులాంటి ఉడుపుల మీద, మంచిగంధం మీద ఇతర సుగంధద్రవ్యాల మీద మక్కువ పడేవాడు. గొప్ప తిండిపుష్టి కలవాడని చెప్పలేకపోయినా భోజనానికీ, రుచులకూ అమితమైన ప్రాధాన్యం ఇచ్చేవాడు. మధ్యాహ్నం భోజనానికి ఉదయంనుంచి తొందర పెట్టేవాడు. ఏం వండాలో, ఎలా వండాలో చెప్పేవాడు. మధ్యాహ్నం భోజనాల దగ్గరే సాయంత్రం అల్పాహారం గురించి ఆరా తీసేవాడు.


పౌరాణికుడిగా, ఆయనది తిరుగులేని స్థానం. అటు చెన్నపట్నం (ఆయన మద్రాసును ఎప్పుడూ చెన్నపట్నం అనే పిలిచేవారు) నుంచి ఇటు ఖరగ్‌పూర్ వరకు ఆయన పురాణప్రవచనం చేయని నగరమూ, పట్టణమూ లేదు. ఆయనకు ప్రతిచోటా అభిమానులుండేవారు. పౌరాణికుడిగా ఎంతపేరు ఉందో, డబ్బు మనిషిగా ఆయనకు అంతపేరూ ఉంది. ఆయనతో పురాణం చెప్పించాలన్న సూచన వచ్చినప్పుడు నిర్వాహకులు మొదట్లో సందేహించేవారు. 'బాబోయ్, ఆయనా, ఆయనతో ఎక్కడ వేగగలమండీ, డబ్బు మనిషి, భరించడం కష్టం' అనేవారు. చివరకు ఆయననే పిలిచి బ్రహ్మరథం పట్టేవారు. ఆయనకు అటువంటి అయస్కాంతశక్తి ఉండేది. ఆయన వెనుక డబ్బు మనిషి, లౌక్యుడు అంటూ తీసిపారేసేవారు కూడా ఆయన ఎదుటికి వచ్చేసరికి మైనంలా మెత్తబడిపోయి ఆయన మాటల ఇంద్రజాలానికి చిత్తయిపోయేవారు. చతుర వచనాల మత్తుమందు జల్లి ఎదుటివారిని నిలువుదోపిడీ చేసే కళనే తన జీవితాంతమూ ఆయన సాధన చేశాడా అనిపించేది. తనను లౌక్యుడిగా, డబ్బుమనిషిగా ప్రదర్శించుకోడానికి కూడా ఆయన ఎప్పుడూ సందేహించనట్లే కనిపిస్తుంది. అయినా సరే, తన పౌరాణిక ప్రావీణ్యంతో తాత్కాలికంగానైనా జనం దృష్టిని ఆ వైపు నుంచి అద్భుతంగా మళ్ళించగలిగేవాడు.

భాగవత పురాణ ప్రవచనంలో ఆయన అందెవేసినచేయి. ఆయన ప్రవచనం జరుగుతున్నప్పుడు గుండుసూది కింద పడినా, ఆ చప్పుడు వినిపించేటంత నిశ్శబ్దంగా వింటూ శ్రోతలు పురాణంలో లీనమైపోయేవారు. ఆయా ఘట్టాలకు తగినట్టుగా ఆయా రసాలను తన గొంతులో పలికిస్తూ, మామూలు ముచ్చట్ల స్థాయి నుంచి ఒక్కసారిగా పౌరాణిక శైలిలోకి, మళ్ళీ అక్కడినుంచి ఇక్కడికి లంఘిస్తూ, మధ్యమధ్య తాను కూడా కథా స్వారస్యాన్ని ఆస్వాదిస్తున్న సంగతిని సూచిస్తున్నట్టుగా పాత్రలపట్ల ఒక విధమైన ఆత్మీయతను చాటుతూ, మధ్యమధ్య నాటకీయంగా నవ్వుతూ వ్యాఖ్యాన సహితంగా కథను రక్తికట్టిస్తూ పౌరాణికకళలోని అన్ని పార్శ్వాలనూ, ఒడుపులనూ ఒక్కచోట గుప్పించేవాడు. కంసుడి భయంవల్ల బాలకృష్ణుడితోసహా యశోదానందులు సపరివారసమేతంగా వ్రేపల్లె నుంచి బృందావనానికి తరలిపోతున్న ఘట్టాన్ని, కృష్ణవియోగాన్ని తలచుకొని వ్రేపల్లెవాసులు పడే దుఃఖాన్ని ఆయన మాటలలో బొమ్మకట్టి చూపిస్తుంటే శ్రోతలు అక్షరాలా కంటతడిపెట్టేవారు.

శ్రోతలను ఏడిపించగలిగిన గణపతిబాబాయి తను స్వయంగా రసానందాన్ని అనుభవించగలిగేవాడా, జనాన్ని కరుణభక్తిరసాలలో ముంచి తేల్చగలిగిన బాబాయిలో ఆ కారుణ్యస్పందనలు కానీ, ఆ భక్త శబలత కానీ ఉండేవా అన్న అనుమానం నన్ను ఎప్పుడూ వెంటాడుతూనే ఉండేది. ఆయన వ్యక్తిత్వం ఎన్నో వైరుధ్యాల మిస్టరీగానే నాకు ఎప్పుడూ కనిపించేది. ఒక నటుడు తనను మరుగు చేసుకొని జీవితాంతమూ ప్రేక్షకుల దృష్టిలో కొన్ని పాత్రలుగానే మిగిలిపోయినట్లుగా మా బాబాయి కూడా తనను దాచుకొని పురాణ వేదిక మీదా, బయటాకూడా పౌరాణికుడిగానే మిగిలిపోయాడా అనిపిస్తుంది. అదే నిజమైతే మరుగునపడిన ఆయన మరో జీవితం ఎటువంటిది, అది ఏమైపోయింది?

పౌరాణికప్రపంచం వెలుపలి జగత్తుతో ఆయన అస్తిత్వాన్ని ముడిపెట్టినది డబ్బు






అనే రెండక్షరాలేనేమో. ఆయన నోట ఎప్పుడూ డబ్బు, డబ్బు అనే మాట వినిపించేది. 'రూపాయలు కావాలి, రూపాయలు' అనేవారు. ఎవరైనా పురాణ ప్రవచనానికి ఆహ్వానిస్తే, ఒక అరసంచి రూపాయలు (అరసంచి అంటే అయిదువందల రూపాయలు) ముందు ఇస్తే ఇంటి వ్యవహారాలు చక్కబెట్టుకొని వస్తాననేవారు. ఆయనలోని డబ్బుమనిషి, లౌక్యుడు క్రమంగా కుటుంబసంబంధాలలోకి కూడా విస్తరించడంవల్ల బంధువుల మధ్య కూడా ఆయన వివాదాస్పదుడుగా మారుతూ వచ్చాడు. ఆయన చుట్టూ- మా ఇంట్లో, మా చిన్న బాబాయి ఇంట్లో గొడవ పడడానికి తగినంత గ్రంథం, ఎప్పటికప్పుడు తయారవుతూనే ఉండేది. ఆయన మాటలపై, ప్రవర్తనపై దాడులు జరిగేవి. ఆయన మంద హాసంతో తలపంకిస్తూ 'సరిసరి' అనేవాడు తప్ప నోరు చేసుకొని దెబ్బలాడిన సందర్భాలు చాలా తక్కువ.

గణపతి బాబాయి గురించి, 'డబ్బుమనిషి, పెడసరంగా మాట్లాడతాడు' అన్న ముద్రతోనే మేము పెరిగాం. ఆయన జీవితం గురించిన వేరే కోణాలు ఏవీ మాకు అంతగా తెలియదు. తెలిసినవాటినుంచి కూడా ఆయన సమగ్ర వ్యక్తిత్వాన్ని నిర్మించాలన్న ఆలోచనకానీ, అవసరంకానీ మాకు రాలేదు. మా నాన్న తరం గతించిన ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు వాళ్ళను ఒక చరిత్రగా, నిశ్చలన చిత్రాలుగా చూడగలిగే వీలు కలిగి వాళ్ళను సమగ్రంగా అర్థం చేసుకోగల అవకాశం ఏర్పడినట్లుంది.

వయసులో బాబాయి కంటె మా అమ్మ చిన్నదే అయినా వదినగా పెద్ద హోదాలో ఉంది కనుక మా నాన్న తర్వాత ఆయన మీద కోప్పడడానికీ, మందలించడానికీ ఆమెకు అధికారం ఉండేది. ఆ అధికారం తోపాటు ఆయన మీద ఆపేక్ష కూడా ఉండేది. ఆయన వ్యక్తిత్వంలోని మంచిచెడుల పార్శ్వాలు రెండూ ఆమె మాటల ద్వారా మాకు తెలిసేవి.

బెజవాడ కొత్తగుళ్ళలో ఆయన పురాణం చెప్పినప్పుడు, సంతానంలేని ఒక సంపన్న వితంతువు ముచ్చటపడి, 'శాస్త్రిగారూ! మీకొక ఇల్లు రాసిస్తాను, మీరు ఇక్కడే ఉండా'లని బతిమిలాడిందట. అప్పుడు మా బాబాయి, 'నాకీ ఊళ్లో ఇల్లెందుకమ్మా, మా ఊళ్లో గోదావరి తీరంలో మాకు లంకంత ఇల్లుంది' అని తిరస్కరించాడట.

'గణపతి బాబాయిది సామాన్యమైన సంపాదనా! పురాణం చెప్పిన ప్రతిచోటా అతనికి బ్రహ్మరథం పట్టేవారు. ఘంటాకంకణాలు తొడిగేవారు. డబ్బుతో ముంచెత్తేవారు. కావలిలో, ఒంగోలులో ఇల్లు కట్టించి ఇచ్చారు. ఉంచుకుంటే కదా! ఏడాది రెండేళ్ళకే అమ్మేశాడు. కళ్ళ ముందు ఎప్పుడూ రూపాయలు కనబడుతూ ఉండాలి. అంత సంపాదనా ఏమైపోతుందో తెలియదు. ఎప్పటికప్పుడు తడుములాటే' అనేది మా అమ్మ.

మాకు ఊహ తెలిసిన తర్వాత ఆయన గుంటూరులో పెద్ద ఇల్లు కట్టి గృహప్రవేశం చేసిన సంగతి మాత్రం నాకు గుర్తుంది. గృహప్రవేశం రోజునే దీపాలవేళ నట్టింట్లో కూర్చొని ఆయన మానాన్నతో మాట్లాడుతూ, 'ఒరే అన్నయ్యా! ఈ ఇల్లు అమ్మితే ఒక లక్షరూపాయలు రావూ?' అనడం, 'అదిగో అప్పుడే అమంగళం మాటలు మొదలుపెట్టావూ, ఇదెక్కడి విపరీతబుద్ధిరా నీది' అంటూ మానాన్న కోప్పడడం నాకిప్పటికీ గుర్తు. ఏణ్ణర్థానికే ఆయన ఆ ఇల్లు కూడా అమ్మేశాడు. తర్వాత, ఇల్లు కట్టుకోండి శాస్త్రిగారూ అంటూ విశాఖపట్నంలో ఎవరో స్థలం ఇచ్చి సామగ్రి కూడా సమకూర్చడం, ఆ స్థలాన్నీ సామగ్రినీ కూడా ఆయన అమ్మేయడం జరిగాయి. చివరివరకు ఒక స్థిరమైన చిరునామా, స్వంత ఇల్లూ లేని దేశదిమ్మరిగానే ఆయన తనువు చాలించాడు.

బాబాయి ఒక్క ఇంటినీ నిలుపుకోలేకపోవడానికి కారణం ఏమై ఉంటుంది? అమ్మ తరచు చెబుతూ వచ్చిన ఒక ముచ్చటలో దీనికి సమాధానం దొరుకుతుందేమో! మా పిన్ని కాపురానికి రాకముందూ, వచ్చిన తర్వాతా కొంతకాలం మానాన్న, మా బాబాయి బెజవాడలో కలిసే ఉండేవారట. భార్య కాపురానికి రాకముందు, బెజవాడ కొత్తగుళ్ళలో ఆయన పురాణం చెప్పినప్పుడు, సంతానంలేని ఒక సంపన్న వితంతువు ముచ్చటపడి, 'శాస్త్రిగారూ! మీకొక ఇల్లు రాసిస్తాను, మీరు ఇక్కడే ఉండా'లని బతిమిలాడిందట. అప్పుడు మా బాబాయి, 'నాకీ ఊళ్లో ఇల్లెందుకమ్మా, మా ఊళ్లో గోదావరి తీరంలో మాకు లంకంత ఇల్లుంది' అని తిరస్కరించాడట.

తర్వాత తర్వాత డబ్బుమనిషిగా ముద్రవేయించుకున్న బాబాయి అప్పట్లో అయాచితంగా ఇల్లు ఇస్తానంటే ఎందుకు తిరస్కరించినట్లు? మా ఊళ్ళో లంకంత ఇల్లు ఉండగా ఇక్కడ ఇల్లెందుకని ఎందుకు అన్నట్లు? కోరివచ్చిన సంపదను కొనుగోట తోసి పారేసి ఆర్థికానికి అతీతంగా స్వంత ఇష్టాయిష్టాలతో జీవితంమీద స్వాతంత్ర్యాన్ని స్థాపించుకోవాలన్న ఐడియలిజం అందరిలో ఉన్నట్టే ఆయనలో కూడా తన యవ్వనారంభ జీవితంలో ఉండేదా? మా బాబాయి వ్యక్తిత్వంలో మాకు తెలియని ఎంత అందమైన, అద్భుతమైన పార్శ్వం ఇది! మా ఊళ్ళో మాకు లంకంత ఇల్లు ఉండగా ఇక్కడ ఇల్లెందుకమ్మా అనడంలో ఆయనకు సొంత ఊరుమీద ఇంటిమీద అమితమైన మక్కువ ఉండేదా? స్వంత ఊరుకు తిరిగి వెళ్ళిపోవాలన్న అందమైన కోరిక తన జీవితం పొడవునా ఒక సుప్తవాంఛగా ఆయనలో ఉండిపోయిందా? అభిమానులు తనకు ఇల్లు కట్టించి ఇచ్చిన ప్రతిచోటా ఆ ఇంటిని అమ్మి వేయడానికి అదే కారణమా? ఆయన తన అంతఃకరణనూ, అసలు నైజాన్ని, ఇష్టాయిష్టాలను స్వంత ఊరుకు మీదుకట్టి ఎప్పటికైనా ఇంటికి తిరిగి వెళ్లాలన్న కోరికను అంతరాంతరాల్లో జాగ్రత్తగా దాచుకుంటూ జీవితతాంతమూ మారువేషంలో, దేశదిమ్మరిగా, ప్రవాసిగా గడిపాడా? రాత్రికో, మరునాడో ఇంటికి తిరిగి రావాలనుకొని పనిమీద ఇల్లువిడిచి వెళ్ళి దారి తప్పిపోయి, ఎక్కడెక్కడో తిరుగుతూ ఇంటికి చేరలేకపోయిన ఒంటరి బాటసారిలా మిగిలిపోయాడా? 'తన'ను దాచుకొని, ఊళ్ళే రంగస్థలంగా ఒక జీవితకాలం విస్తరించిన సుదీర్ఘనాటకంలో పౌరాణికుడిగా, ఒక పగటి వేషధారిగానే ఉండిపోయాడా?

గణపతిబాబాయి వ్యక్తిత్వంలో మా దృష్టికి రాని మరో అపురూప పార్శ్వాన్ని ఇపుడు పునర్నిర్మించుకోడానికి అమ్మ ఆయన గురించి చెబుతూ వచ్చిన మరికొన్ని ముచ్చట్లు అవకాశమిస్తున్నాయి.

'ఇప్పుడిలా పచ్చికాయలా అయిపోయాడు కానీ గణపతి బాబాయి అన్నదమ్ముల కుటుంబాలకు ఎంత చాకిరీ చేశాడురా! నేను కాపురానికి వచ్చిన కొత్తల్లో బాబాయి మాతోనే ఉండేవాడు. నేను బెరుకు పడుతుంటే ధైర్యం చెప్పేవాడు. ఇంట్లో పెద్దపనీ, చిన్నపనీ నెత్తి నేసుకొని చేసేవాడు. అన్నయ్య చేతి కందేవరకు అన్నింటికీ ఆసరా అయింది బాబాయి కాదేమిటి? నాన్న ఎప్పుడూ రాతలో మునిగిపోవడమే తప్ప సంసారాన్ని పట్టించుకొన్నదెప్పుడు? అక్కయ్యలకు, చిన్నబాబయ్య కూతుళ్ళకు కాలికి బలపం కట్టుకొని తిరిగి సంబంధాలు చూసింది గణపతిబాబాయే. నాకు కళ్ళ జబ్బు వస్తే మద్రాసు తీసుకెళ్ళి వైద్యం చేయించింది తనే'. అమ్మ ఈ మాట

లంటున్నప్పుడు బాబాయిపై ఆపేక్షతో కూడిన కృతజ్ఞతా సూచకమైన మెరుపు ఆమె కళ్ళల్లో కనిపించేది.

నిలువెల్లా లౌక్యుడుగా, డబ్బుమనిషిగా నలుగురూ చెప్పుకునే బాబాయిలో డబ్బుకు అతీతమైన ఇటువంటి మమతానురాగాల సున్నిత స్పందనల కోణం కూడా ఉండడం నిజంగా ఎంత అద్భుతం! ఇంతకీ బాబాయి వ్యక్తిత్వంలోని ఈ సొగసులన్నింటినీ మరుగుపుచ్చేటంతగా డబ్బుముద్ర ఆయన జీవితాన్ని ఎందుకు కమ్మివేసినట్లు?

మా తాతగారు చనిపోయేనాటికి మా నాన్న వయసు పన్నెండేళ్ళయితే, బాబాయి వయసు పదేళ్ళు. మా నాయనమ్మ ఎప్పుడూ ఆధ్యాత్మికచింతనే తప్ప సంసారం మీద పెద్దగా దృష్టిపెట్టి ఎరగదు. పిల్లలు పెద్దవాళ్ళయి పెళ్ళిళ్ళు అయిన తర్వాత కూడా ఆమె పాపికొండల్లోని ఒక ఆశ్రమంలోనే ఉంటూ ఉండేది. ఊళ్లో కరణీకం, పదెకరాల పొలం, కొంత మామిడితోట ఉండేవి. కరణీకంలో, పొలంనుంచి శిస్తు రూపంలో వచ్చే ఆదాయం చాలదనిపించో, లేక వాటిపై మనసు లేకో, విస్తరించే తమ సృజనాత్మక వ్యక్తిత్వాలకు ఆ ఊరు ఇరుకనిపించో మానాన్న, బాబాయి ఇద్దరూ నిరాధారుడుగా ఉన్న మేనమామకు కరణీకాన్ని విడిచిపెట్టి ఊరు దాటిపోయారు. అంతకుముందు ఇద్దరూ మొదట్లో ఒకే గురువు వద్ద కొంతకాలం కలిసే విద్యాభ్యాసం చేసినా నాన్న కుదురుపాటించారు కానీ బాబాయికి ఒకచోట కాలు ఆనలేదు. నాన్నగారు ఉద్యోగానికి పనికొచ్చే యూనివర్శిటీ డిగ్రీ సంపాదించుకొని ఉద్యోగంలో స్థిరపడ్డా, బాబాయి ఉద్యోగానికి అర్హమైన ఏ చదువూ చదవలేదు.

ఉద్యోగానికి అర్హత కల్పించే చదువు ఏమీ లేకుండా, ఉద్యోగం లేకుండా కేవలం మాటలు అమ్ముకొని జీవించే మనిషిగా బతకవలసి రావడంవల్ల కలిగిన అస్థిరత్వం, అనిశ్చితి, అభద్రతల కారణంగా ఆయన డబ్బుకు లొంగిపోయాడా?


డబ్బు మనిషిగానే మాకు బాగా తెలిసిన గణపతి బాబాయి కూడా చిన్నతనంలో బాగా చదువుకోవాలని తపించాడనీ, ఇంట్లో కూడా చెప్పకుండా కాశీకి పారిపోయాడనీ తెలియడం- మరుగుపడిన ఆయన వ్యక్తిత్వంలోని మరో అందమైన పార్శ్వం.

ఓసారి ఆయనే ఈ సంగతి ఎవరికో చెబుతుండగా విన్నాను. అప్పట్లో లక్ష్మణశాస్త్రి అని, దేశం మొత్తంలోనే ప్రథముడుగా లెక్కించే ఒక మహాపండితుడు కాశీలో ఉండేవాడట. ఆయన శిష్యుడినని చెప్పుకోవడం గొప్ప గర్వకారణంగా ఉండేదట. ఎంతవరకు పనికివస్తాడో పరీక్షించి గానీ ఆయన ఎవరినీ శిష్యుడుగా స్వీకరించేవాడు కాదట. కాశీ వెళ్ళిన మా గణపతి బాబాయి వెతుక్కుంటూ ఆయన ఇంటికి వెళ్ళే సరికి అక్కడ కనిపించిన దృశ్యం చూసి నిశ్చేష్టుడైపోయాడట. అప్పుడు లక్ష్మణశాస్త్రి గారు వంటకు సిద్ధం చేయడానికి ఒకపెద్ద చేపను బండకేసి రుద్దుతున్నాడట (ఉత్తర, పశ్చిమ, తూర్పు రాష్ట్రాలలో కొన్నిచోట్ల బ్రాహ్మణులు మత్స్య భక్షణం చేస్తారు). చేపను బండకేసి రుద్దుతూనే సంస్కృతంలో, ఎక్కడినుంచి వచ్చావు, ఏ శాస్త్రం చదవాలని వచ్చావు అంటూ గణపతి బాబాయి పై ప్రశ్నలవర్షం కురిపించాడట. బిక్కచచ్చిపోతూనే ఆ ప్రశ్నలకు సంస్కృతంలోనే బాబాయి జవాబులు చెప్పాడు. సంతృప్తి చెందిన లక్ష్మణశాస్త్రి, నిన్ను విద్యార్థిగా స్వీకరిస్తున్నాను, నీ పెట్టె బేడా తీసుకొని తక్షణమేరా, నేటి నుంచి నీ భోజనమూ, మకామూ ఇక్కడేనని తొలి ఆదేశం జారీ చేశాడు. సరేనని అప్పటికి తల ఊపిన మా బాబాయి బతుకు జీవుడా అనుకుంటూ, బయటపడి అంతటిలో కాశీ చదువు కోరికను కాశీలోనే విడిచిపెట్టి అదే రోజున ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడట.

మరుగుపడిన ఆయన మరో వ్యక్తిత్వానికి చెందిన ఈ కొద్దిపాటి వివరాలను బట్టి, ప్రారంభంలో ఆయన డబ్బుకు దూరంగా, లేదా డబ్బును జయించి తనవైన ఆసక్తులను, ఇష్టాయిష్టాలను, ఆదర్శాలను సంరక్షించుకోవడానికి తపన పడినట్లు కనిపిస్తుంది. కానీ క్రమంగా డబ్బు ఆయనను జయించినట్లుంది. అభద్రతాభావం ఆయన ఊహల్లో డబ్బు ప్రాధాన్యాన్ని విరాట్‌రూపంలో పెంచివేసిందేమో! డబ్బు అనే ఎండమావి వెంట పరుగులు తీయడంలోనే ఆయన జీవితం మొత్తం చెల్లిపోం ఖందేమో! డబ్బు మోహంలో పడి 'తాను'గా జీవించడం మరిచిపోయాడేమో!

డబ్బును జయించి జీవితాన్ని, నిజమైన జీవితాన్ని గెల్చుకోవాలన్న స్పృహ కూడా అంతరించిపోయిన స్థితిలో పదిమందికోసం కట్టే ఆ పౌరాణికుడి వేషమే ఆయన స్వాభావిక వేషంగా, పౌరాణిక జీవితమే తన అసలు జీవితంగా మారిపోయాయేమో! ఎప్పుడో స్వంత ఊరు విడిచి, చిరునామా లేని దేశదిమ్మరిగా ఎక్కడెక్కడో తిరిగి తన తనాన్ని కోల్పోయిన గణపతి బాబాయి తనదికాని చోటే తనువు చాలించాడు! నాకు ఇక్కడ ఇల్లెందుకమ్మా, మా ఊళ్లో మాకు లంకంత ఇల్లు ఉందని గర్వంగా చెప్పుకుని జీవితాన్ని గెల్చుకునే ప్రయత్నంలో డబ్బును శాసించబోయిన గణపతిబాబాయి, చివరకు డబ్బు శాసనానికి తలవంచి జీవితాన్ని కోల్పోయాడా?!

లేమివల్ల, వెంటాడే లేమి భయంతో విశ్వరూపం ధరించే డబ్బుయావవల్ల స్వతంత్ర, సృజనాత్మకజీవితాన్ని కోల్పోయిన గణపతి బాబాయిలు ఎందరో! •



## ఊరించే రుచులు కావాలంటే!

మీకు కొన్ని చుక్కల నిమ్మరసం కావాలా? అయితే నిమ్మకాయను రెండు చెక్కలుగా కోయకండి. నిమ్మకాయకు టూత్‌పిక్‌తో చిన్న రంధ్రం చేయండి. మీకు కావలసినంత రసాన్ని దానిద్వారా పిండండి. మిగిలిన నిమ్మకాయను రిఫ్రిజిరేటర్‌లో పెట్టండి. నిమ్మరసం అవసరమైనప్పుడు తాజా నిమ్మరసాన్ని మళ్ళీ తీసుకోవచ్చు.

* పూరీ, చపాతీ కూరల్లో టమాటాలు ముక్కలుగా వేయ కండి. మీరు చేసే కూర పరిమాణాన్ని బట్టి ఒకటి లేదా రెండు టమాటాలను మెత్తగా నూరిచేసి కూరలో కలపండి. కూర రంగు, రుచి బాగుంటాయి.

* మీరు కూరల్లోకి వాడే మసాలా ముద్ద బ్రౌన్ కలర్‌లో రాలేదా? అయితే దాంట్లో చిటికెడు కాఫీపొడి వేయండి. పొయ్యి ఆర్పడానికి రెండునిమిషాల ముందు వేయండి. మంచి రంగు, వాసనతో తినడానికి బాగుంటుంది.

* గాజుగ్లాసులు ఒకదాంట్లో ఒకటి ఇరుక్కుపోయాయా? విడదీయడానికి గట్టిగా లాగకండి. పగిలిపోతాయి. పై గ్లాసు నిండా చల్లటి నీరు పోయండి. కింద గ్లాసులో కొంచెం వేడినీరు పోయండి. క్షణాలు గ్లాసులు విడిపోతాయి. గ్లాసులు పగలకుండా, బీటలువారకుండా సులభంగా తీయవచ్చు.

### చిట్కాలు

* ఆహార పదార్థాల చుట్టూ చీమలు పడుతున్నాయా? అయితే ఒక వెల్లుల్లి రేకను తీసుకోండి. దాన్ని ఒలిచి, సగం చేయండి. దానితో పదార్థాల చుట్టూ నేలమీద బౌండరీ గీయండి. మీరు గీసిన గీతను దాటి చీమలు రావడానికి సాహసించవు.

* కొబ్బరి కాయ కొట్టిన వెంటనే చెక్కలు ఫ్రీజర్‌లో పెట్టండి. వాడాలనుకున్నప్పుడు ఒక బౌల్‌లో నీళ్ళుపోసి దాంట్లో వేయండి. కొన్ని నిముషాల తర్వాత కొబ్బరి పెంకుకు అంటుకోకుండా సులభంగా వస్తుంది.

* చిన్న దూదిని తీసుకొని, రోజ్ వాటర్‌లో ముంచండి. దాన్ని ఫ్రిజ్ స్టెబిలైజర్ దగ్గర పెట్టండి. ఆ గదిలో చెడు వాసన పోయి తాజా పరిమళాలు వ్యాపిస్తాయి. పెప్పర్‌మెంట్ ఎసెన్స్‌లో కొంచెం దూదిముంచి వంటగదిలో పెట్టండి. వంటిల్లు సువాసనతో నిండుతుంది.

* నువ్వులను వేయించి మెత్తగా పొడి చేయండి. దాంట్లో ఎండుకొబ్బరి పొడిని కలిపి గాలి చొరబడని సీసాలో పోయండి. చాలారోజులు నిలవ వుంటుంది. కూరలు వండేటప్పుడు రెండు, మూడు చెంచాలు వేయండి. రుచిగానూ, ముద్దగానూ వుంటుంది.

\- హరిత